


కోదండరాముడి సేవలో జడ్జి శ్రీదేవి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీకోదండ రామ స్వామిని అనంత పురం జిల్లా ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ జడ్జి జి.శ్రీదేవి, ఆమె భర్త రామారావు బుధవారం దర్శిం చుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి రాగా అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాలువా కప్పి సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ పురాతన రామాలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.



కోదండరామాలయంలో జడ్జి దంపతులు



11 రోజులు@ 7,230 ఇళ్లు

ఉమ్మడి జిల్లాలో హౌసింగ్ ప్రణాళిక నత్తనడకన సాగుతోంది. ఈ నెల 20న దీపావళి పండుగ నాటికి 10,821 పక్కాగృహాలను పూర్తి చేయాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్దేశించిన లక్ష్యానికి ఆమడదూరంలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర హౌసింగ్ డిపార్టుమెంట్ ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య జిల్లా హౌసింగ్ యంత్రాంగాలు దీపావళి పండుగ సమయానికి కడపలో 10,821 ఇళ్లు, అన్నమయ్యలో 12,571 పక్కాగృహాలను పూర్తి చేయడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించుకుంది. ఉభయ జిల్లాల పరిధిలోని మౌలిక వసతుల కొరత, పెండింగ్ బిల్లుల బకాయి వంటి క్షేత్రస్థాయి పరిస్థితులను మదింపు వేసుకున్న అనంతరం 75 శాతం మేరకు లక్ష్యాల్ని అందుకునే అవకాశాలు అరకొరగానే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

- **పేదింట దీపావళి కాంతులు అరకొరే**
- **రూ.10 కోట్ల బకాయి పెండింగ్**
- **మౌలిక వసతులతో సతమతం**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 98,073 పక్కాగృహాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 2024 జూన్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన హౌసింగ్ అధికారుల సమీక్షా సమావేశంలో కడప జిల్లాలో 10,821, అన్నమయ్య జిల్లాలో 12,571 పక్కాగృహాలను పూర్తి చేయాలనే ఉభయ జిల్లాల హౌసింగ్ యంత్రాంగాలు లక్ష్యాల్ని తీసుకున్నాయి. 2024 జూన్ నుంచి 2025 అక్టోబర్ మొదటి వారానికి కడప జిల్లాలో 7,950 పక్కాగృహాలను మాత్రమే పూర్తి చేసింది. ఈలెక్కన 70.14 శాతానికి పరిమితమైంది. ఈ నెల 20 నాటికి 11 రోజుల వ్యవధి ఉన్న నేపథ్యంలో మరో ఐదు శాతం మేరకు పెరిగి 8,100 పక్కాగృహాలు పూర్తి చేయడానికి అవకాశాలు ఉన్నాయనే ఇంజినీరింగ్ వర్గాలు అంచనా. అన్నమయ్య జిల్లాలో 7,642



పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేసింది. ఈ లెక్కన 60.79 శాతం మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 20న దీపావళి పండుగ నాటికి 11 రోజుల వ్యవధిలో మరో ఐదు శాతాన్ని కలుపుకుని లెక్కిస్తే 7,800 పక్కాగృహాలు పూర్తి చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీపావళి పండుగ లక్ష్యంలో భాగంగా కడప జిల్లాలో 3,231 పక్కాగృహాలు, అన్నమయ్య జిల్లాలో 3,999 పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

మౌలిక వసతులతో వెతలు

కడప, అన్నమయ్య జిల్లాలోని పక్కాగృహాల లేఅవుట్లను మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ఆశించిన రీతిలో పక్కాగృహాల నిర్మా ణాలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. జిల్లా హౌసింగ్ యంత్రాంగాలు ఆయా లేఅవుట్ల వారీగా సమస్యల్ని అధ్యయనం చేయడంపై దృష్టి సారించినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. ప్రతి లేఅవుట్‌లోనూ నీటి సరఫరా, రహదారులు, ఎలక్ట్రిఫికేషన్, వస్తువుల అపహరణ వంటి సమస్యల్ని, సదుపాయాల లోపాల్ని గుర్తించింది. ఎలక్ట్రిఫికేషన్ సదుపాయాల కల్పనకు చొరవ తీసుకున్నప్పటికీ లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోంది.

రూ.10 కోట్ల బకాయి పెండింగ్!

కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని హౌసింగ్ నిర్మాణాలకు బకాయి సమస్య వెంటాడుతోంది. కడప జిల్లాలోనే రూ.10 కోట్ల మేరకు బకాయిలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. ఫలితంగా పక్కాగృహాల లబ్ధిదారులను బిల్లుల చెల్లింపుల భయం వెంటాడుతోంది. రూ.ఎనిమిది కోట్ల మేర నీటి సరఫరా బకాయి పేరుకుని ఉన్నట్లు తెలుస్తోంది. ఏడాది కిందట బకాయి ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి నివేదించింది. అయినప్పటికీ స్పందన కొరవడింది. బకాయి చెల్లింపుల ప్రభావం పక్కాగృహాల నిర్మాణ పనులు పడడంతో హౌసింగ్ యంత్రాంగానికి దిక్కుతోచని పరిస్థితి కనిపిస్తోంది.

లక్ష్యాన్ని అధిగమిస్తాం.

దీపావళి పండుగ నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రయత్నం చేస్తాం. జిల్లాలోని 3,231 పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది.

- రాజారత్నం, హౌసింగ్ పీడీ, కడప.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- **30న అంగన్వాడీల జిల్లా మహాసభ**
- **యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి**

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

జిల్లాలో ఐసిడిఎస్ అధికారులు అవలంబిస్తున్న తీవ్ర నిర్లక్ష్య వైఖరి అంగన్వాడీ కార్యకర్తలకు శాపంగామారి కష్టాలుపాలు చేస్తోందని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయో మెట్రిక్ వేయకపోవడం, బిల్లులు ప్రభుత్వానికి సబ్మిట్ చేయక పోవడం, తప్పుడు బిల్లులు పెట్టడం తదితరాల కారణంగా అంగన్వాడీలకు ఐదు నెలలుగా కూరగా యల బిల్లులు, 4 నెలల సెంటర్‌ల అద్దె, ఒక నెల వేతనం తిరిగి జిల్లా కార్యాలయానికి వెనక్కి పంపినట్లు తెలిపారు. ఫలితంగా అంగన్వాడీలు బిల్లుల కోసం మరో నెల వేచి ఉండక తప్పడం లేదన్నారు. కార్యకర్తలకు ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు అంగన్వాడీ కేంద్రానికి సకాలంలో సరుకులు అందివ్వకపోవడం దారుణమన్నారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు పట్టించుకోక పోవడం తగదని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలపై ప్రజల ఆగ్రహిస్తుంటే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా చోద్యం చూస్తుండడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లబ్ధిదారులకు వస్తువుల అందించే దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఐసిడిఎస్‌కు తగినన్ని నిధులు కేటాయిం చుకోవడం, కొత్త సెంటర్లో మంజూరు చేయకపోవడం పేదలక సంక్షేమాన్ని దూరం చేయడం కాదా? అంటూ ప్రశ్నించారు. ఎటువంటి షరతులు లేకుండా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని త్వరగా హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీన మదనపల్లెలో అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని సమస్యలపై దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. మహాసభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శ్రీలక్ష్మి,వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, రాయచోటి ప్రాజెక్ట్ అధ్యక్షులు సిద్ధమ్మ, లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సుకుమారి, ఓబులమ్మ, వాయల్పాడు కార్యదర్శి భూకైలేశ్వరి, తంబళ్లపల్లె కార్యదర్శి గౌరీ, మదనపల్లె కార్యదర్శి మధు రవాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి

ఆపరేషన్ వికటించి మహిళ మృతి

ఫిర్యాదు చేసినా, ఒత్తిడితో వెనక్కి తీసుకున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రయివేట్ ఆస్పత్రుల వైద్యులు డబ్బే పరమావధిగా వైద్యం చేస్తున్నారు. ఎలాగైనా సరే డబ్బు సంపాదించాలనే అత్యాశతో అరకొర వైద్యం చేస్తూ విలువైన పేదల ప్రాణాలను తీస్తున్నారు. ఈ కోవలోనే మహిళ కాలుకి ఆపరేషన్ చేస్తే అది వికటించి ప్రాణాలే కోల్పోయింది. ఈ విషాదకర సంఘటన బుధవారం మదనపల్లెలో వెలుగు చూసింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు మండలం, బైరెడ్డిపల్లి గ్రామం, గాజీపేటకు చెందిన సిరివేలి గంగప్ప భార్య గంగులమ్మ (60) ఈ నెల 1వ తేదీన మెట్లపై నుంచి దిగుతూ కిందపడి కాలు విరిగింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లెలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన డాక్టర్ రామిరెడ్డి మూడు రోజుల అనంతరం శస్త్ర చేయాలని సూచించారు. తన ఆస్పత్రిలో ఎన్టీఆర్ ఆరో గ్యశ్రీ పథకం అందుబాటులో లేకపోయినప్పటికీ స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలోని ఆస్పత్రిలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద కేసును రెఫర్ చేశారు. అక్కడ కూడా డాక్టర్ రామిరెడ్డే వెళ్లి మంగళవారం ఉదయం శస్త్ర చికిత్స చేశారు. ఐసి యులోని రికవరి బ్లాక్‌లో ఉన్న రోగి వద్దకు రాత్రి వరకూ ఎవరూ రాలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీంతో ఆమె నొప్పులతో అల్లాడిపోయిందని, ఆసుపత్రి సిబ్బందిని అడిగితే తమకు సంబంధం లేదని, డాక్టర్ రామిరెడ్డి ఆసు పత్రికి చెందిన సిబ్బందే చూసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. రామిరెడ్డి ఆస్పత్రికి వెళితే ఏం కాదులే.. అంతా బాగుంది భయపడొద్దని చెప్పి పంపేశారన్నారు. రాత్రి పది గంటల తర్వాత ఆమె మృతి చెందింది. కుటుంబ సభ్యులు డాక్టర్ పై తిరగబడ్డారు. ఆసుపత్రి ఓటి అసి స్టెంట్ దురుసుగా ప్రవర్తించడంతో చేసేదిలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి కావడంతో పోలీసులు ఉదయాన్నే సమ స్యను మాట్లాడతామని సర్ది చెప్పారు. బుధవారం బాధితులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఏదైనా ఉంటే ఫిర్యాదు చేయండి కేసు నమోదు చేస్తాం. డాక్టర్ల వైఫల్యమైతే డాక్టర్ల మీద చర్యలు తీసుకుంటాం. లేదంటే మీపైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వైద్యుడికి వత్తాసు పలుకుతూ చెప్పారన్నారు. భయపడి పోయిన మృతురాలి కుటుంబ సభ్యులు, తమకు ఎలాంటి కేసులు వద్దంటూ ఇచ్చిన ఫిర్యాదును వెనక్కు తీసుకున్నారు. పోలీసులు చెప్పినట్లు, వైద్యులు చెప్పినట్లు తెల్లకాగితంపై రాసి, సంతకం పెట్టి మృతదేహాన్ని తీసుకెళ్లిపోయారు. బాధితులు పోలీసు ఒత్తిడితో చేసేదిలేక మిన్నకుండిపోయారు. పోలీసులు సైతం ఉన్నవాళ్లకే వత్తాసు పలుకుతుండడంతో పేదలు, బడుగు బలహీన వర్గాల వారు తమ ప్రాణాలు పోతున్నా నిస్సహాయ స్థితిలో కుంగిపోతున్నారు. ఇప్పటికైనా వైద్య ఉన్నతాధికారులు స్పందించి ఈ ఘటనపై తిరిగి సమగ్ర విచారణ చేపట్టి ప్రయివేటు వైద్యుల నిర్లక్ష్యంపై తగు చర్యలు తీసుకోవాలని, ఇలాంటి వారికి లైసెన్స్ రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



మృతి చెందిన గంగులమ్మ

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజన పథకంలో ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ, తదితర శాఖల అధికారులు, వివిధ మండలాల ఎంఇఒలు, ప్రధానోపాధ్యా యులతో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, సంక్షేమ పాఠశాలల పనితీరు, వసతులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో, పాఠశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పనిచే యాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఏ చిన్న నిర్లక్ష్యం జరిగిన తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యార్థుల భద్రత అధికారుల బాధ్యతని సూచించారు. హాస్టళ్లు, పాఠశాలల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండా లని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలలో వంటశాలల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కేవలం ఆర్వో నీటిని మాత్రమే వాడాలని ఆదేశించారు. వంటశాలలలో ఉపయోగించే నీరు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు తాగేనీరు పరిశుభ్రంగా ఉండాలని ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కాకూడదని ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను వారానికి ఒకసారి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. వంటశాలలు, పిల్లలు తినే ప్రాంతాలను ప్రతిరోజు పరిశుభ్రం చేయడంతో పాటు వారానికి ఒకసారి పూర్తిస్థాయిలో సానిటరీ చేయాలని ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి వాటి పైప్ లైన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, డ్యామేజైతే వెంటనే మార్చాలన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని గమనిస్తూ ఉండాలని ఎటువంటి చిన్న మార్పులు గమ నించిన వెంటనే మెడికల్ చెకప్ చేయించి, అవసరమైతే సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. హాస్టల్, స్కూల్ సిబ్బంది విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు గమనించి, వెంటనే చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు అంటు వ్యాధులు, ఇన్ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో భోజనం నాణ్యతగా ఉండాలని, ప్రతి రోజు కనీసం ఒక ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి భోజనం చేసి, ఆహార నాణ్యతను పరిశీలిం చాలన్నారు. మెను ప్రకారం భోజనం ఉండాలని ఎటువంటి మార్పులు లేకుండా చూడాలన్నారు. వారం రోజులపాటు అధికారులందరూ హాస్టళ్లు, పాఠశాలలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇచ్చిన ఆదేశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమా వేశంలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ, విద్య శాఖల జిల్లా అధికారులు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు : డిఇఒ



భయారెడ్డిని సన్మానిస్తున్న డిఇఒ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాయచోటి

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినప్పుడే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని డిఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పదవీ విరమణ చెందిన గడ్డం భయారెడ్డికి బుధవారం ఉదయం పాఠశాలలో సన్మాన కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైనదని దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనను మెరుగుపరచు కోవాల న్నారు. బాలికల ఉన్నతపాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన భయారెడ్డి సేవలు మరువలేమన్నారు. అనంతరం డిఇఒతోపాటు ఉపా ధ్యాయుల బృందం దుశ్శాలువా, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి భయరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు సైరాబాను, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, చిన్నపిల్లల వైద్యులు భయారెడ్డి, డిసిఇబి సెక్రెటరీ నాగమునిరెడ్డి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితులపై చిన్నచూపు తగదు : వైసిపి

ప్రజాశక్తి-రాయచోట అర్బన్

ప్రభుత్వ వైద్య విద్యను దళిత విద్యార్థులకు అందుబాటులో లేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేసిందని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మొదటి నుండి చంద్రబాబుకు దళితులంటే గిట్టదని, చిన్నచూపు చూస్తున్నాడంటూ ఆరోపించారు. చంద్రబాబు దళిత వ్యతిరేకి కాదనే వారు చర్చకు రావాలాంటూ సవాలు విసిరారు. రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ ల్యాండ్ కలిగిన దళితుల వద్ద ఒకటి, రెండు,మూడు లక్షలకు పొలాలు తీసుకొని, అదే పొలాలను తిరిగి తిరిగికోట్లాది రూపాయ లకు ప్రభుత్వానికి అమ్ముకున్న ప్రబుద్ధులు టిడిపిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, లోకల్ నేతలు అంటూ వారు మండిపడ్డారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని మానసికంగా తీయాలని, వ్యక్తిత్వాన్ని దిగజార్చాలని మద్యం కేసులో ఇరికించడం ద్వారా చంద్రబాబు భారీ కుట్రకు తెరలేపినట్లు వారు ఆరోపించారు. తంబళ్లపల్లెలో దొరికిన నకిలీ మద్యం బాటిల్ల యాజమాన్యం ఎవరు? రాష్ట్ర మంతట నకిలీ మద్యం తయారు చేస్తున్న దొంగ ఎవరని ప్రశ్నించారు. జగనన్న ఫోర్స్ పేరిట ఒక టీం గా ఏర్పాటు అవుతున్నామని, జగన్ తిరిగి సిఎంగా చేసుకునేందుకు దళితు లందరూ సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ పేరుతో ప్రజలను దోచుకోవడమే చంద్రబాబు జీవిత పాలనన్నారు. కూటమి నేతలు శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వేలాది బెల్ట్ షాపులను పెట్టి ప్రజలను దోచు కుంటున్నారన్నారు. ఇసుకను ఉచితం పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం తో పాటు కూటమి నేతలు వేలాది టిప్పర్లతో ఇసుకను ఇతర రాష్ట్రాలకు తర లించి సొమ్ము చేసుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి అవినీతి, అక్రమాలు అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదంటూ విమర్శించారు. వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

వై.ఎస్.జగన్‌ను కలిసిన మొహమ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మాజీ సిఎం వై.ఎస్.జగన్‌ను వైసిపి మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ బుధవారం విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి కలిసి కలిశారు. ఈ సందర్భంగా మొహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ కే.శే.హాజీ బేపారి బషీర్‌ఖాన్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, రాయచోటిలో మంచి మైనార్టీ నేతను కోల్పోవడం చాలా బాధాకరమని వైఎస్ జగన్ అన్నారని తెలిపారు. భవిష్యత్తులో బేపారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మోస పూరిత హామీలపై ప్రజల పక్షాన పోరాడాలని సూచించారని చెప్పారు. జగన్‌ను కలిసిన వారిలో జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ కరీముల్లా, యువజన విభాగం బేపారి జాబీఉల్లా ఖాన్, పట్టణ కార్యదర్శి అసద్ ఖాన్, జావీద్, ఖదీర్, సమీర్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట

ఈ నెల 26వన రాయచోటిలో నిర్వహించు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.రమణ మున్సిపల్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట పట్టణంలో వారు పాత్రికేయులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు తక్షణమే పిఆర్‌సి అమలు చేయాలని, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, కార్మికులకు పని భారం తగ్గించి అదనపు కార్మికులను నియమించాలని, 12వ పిఆర్‌సి ప్రకారం రూ.32 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి లక్ష్మీదేవి, ఎం.వి రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థుల్లో శాస్త్రీ ఆలోచన దృక్పథం పెంపొందించడానికి చెకుముకి సైన్స్ ప్రతిభాపరీక్ష ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.బుధవారం మధ్యాహ్నం తన కార్యాల యంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులతో కలిసి చెకుముకి సంబరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందిం చడానికి చెకుముకి సైన్స సంబరాలు తోడ్పడతాయన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తప్ప నిసరిగా ఈ సంబరాల్లో పాల్గొనేటట్లు చొరవ చూపాలన్నారు. అనంతరం జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జిల్లాలోని 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సైన్స్ సంబరాలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18, మండల స్థాయిలో నవంబర్ 1, జిల్లా స్థాయిలో నవంబర్ 23, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాష్ రెడ్డి,డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, ఐఇడి కో-ఆర్డినేటర్ జనార్ధన్, ప్రధానోపాధ్యాయులు శివయ్య, రెడ్డన్న చేతిరత నిపుణులు రెడ్డన్న పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ, ప్రిన్సిపల్

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కోడిపందెం రాయుళ్లకు చెక్ పెట్టేందుకు జిల్లా పోలీసులు విస్తృతంగా డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలిస్తున్నారని ఎస్‌పి ధిరజ్ కును బిల్లి అన్నారు. బుధవారం అత్యధిక డ్రోన్ కెమెరాలతో నిఘాపెంచిన పోలీసులు రామసముద్రం ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్న కోడిపందాలను గుర్తించారు. డ్రోన్ కెమెరాను చూడగానే కోడి పందెం రాయుళ్లు ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి కొండలు, గుట్టలు గుండా పరుగులు తీశారు.డ్రోన్ రికార్డు చేసిన పోలీసులు ఘటన స్థలం వద్ద నిలిపిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నింది తులను త్వరలోనే గుర్తించి పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపాం జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు ఉపేక్షించేది లేదని పోలీసులు ఎప్పుడు డ్రోన్ నిఘా ద్వారాపర్యవేక్షిస్తూ ఉంటారని చట్టాన్ని ఉల్లంఘించే వారిపై గట్టి చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రోడ్డుకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-రాయచోటి : రాయచోటి-సుండుపల్లి రోడ్లకు నిధులు కేటాయించి రోడ్ల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రాయచోటి -సుండుపల్లె డబుల్ లైన్ రోడ్డుకు నిధులు కేటాయించడం జరిగిందని, అయితే అటవీ శాఖ అనుమతులు లేని కారణంగా సంవత్సరాల తరబడి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఒప్పందం మేరకు సకాలంలో పనులు పూర్తి చేయకుండా నిలుపుదల చేశారని తెలిపారు.అయితే చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో ఆలస్యం చేయడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేకపోయారని ప్రచారంలో ఉన్నట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతులు లేవనే మిసతో అడవియే లేని శిబ్యాల వంకపై బ్రిడ్జి నిర్మాణం పనులు అర్థాంతరంగా వదిలేయడం, సుండుపల్లె మండల కేంద్రంలో పనులు మొదలు పెట్టకపోవడం కాంట్రాక్టర్ అలసత్వం, రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనత, నిధులు చెల్లించడంలో ప్రభుత్వ వైఫల్యంతో ఆ రోడ్డు పనులు ఎక్కడిక్కడ ఆగిపోయినట్లు ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కాలం దాటి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోయినాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధనరెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి భాధ్యతలు నిర్వహిస్తూనే చేసినప్పటికి ఆ రోడ్డు నిర్మాణ పనులు విషయంలో పురోగతి లేదన్నారు. కొత్తగా టెండర్లు పిలిచైనా రోడ్డు నిర్మాణ పనులు సత్వరం పూర్తిచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. ఆ ప్రక్రియ వల్ల శాశ్వత పనులకు ఆలస్యం జరిగే ప్రమాదం ఉన్నందున తాత్కాలిక ఉపశమనం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

మహిళలకు రక్షణగా పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలకు రక్షణగా 24 గంటలు పోలీసులు అండగా ఉంటారని శక్తి బృందం సభ్యులు తెలిపారు. ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మదనపల్లె లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం శక్తి బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ భద్రత, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి, వంటి ఇతర ముఖ్యమైన విషయాల గురించి పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. శక్తి యాప్‌ను మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అత్యవసర సమయంలో ఆ యాప్ ద్వారా సకాలంలో పోలీసులు స్పందించి సహాయం చేస్తారని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి వేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ, పప్పిరెడ్డిపల్లి కాలనీ ఇండ్లలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు జంగాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి శాలువ, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడానికి గాను సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయడం కోసం తాను సిద్ధంగా ఉన్నానని, సిఎం చంద్రబాబు నాయకత్వంలో మదనపల్లి నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తాజ్ మస్రూర్, ఇంజినీరింగ్ ఎఇ రమణ, రాయచోటి శశికుమార్, రాజా, సోమశేఖర్, జెసిబి వేణు, గురునాథ్ యాదవ్, బైగారి రాజా నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నాణ్యతలో రాజీపడొద్దు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యార్థుల కోసం నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దు అని సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజినీర్ నాగభూషణం అన్నారు. ముష్టూరు పంచాయతీలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ.1.60 కోట్ల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని ప్రిన్సిపల్ ముని వెంకటమ్మ, స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న భవనంలో మూడు తరగతి గదులు మూడు వసతి గదులు, పది మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పునాది పనులు జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి నూతన భవనాన్ని విద్యార్థుల కోసం అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తున్నామన్నారు.

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి కూలీలు ఇకెవైసి తప్పకుండా చేసుకోవాలని లేకుంటే కూలీల ఖాతాల్లో డబ్బులు జమ కాదని ఎంపిడిఒ జాషువా తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఉపాధి సిబ్బంది, ఇకెవైసిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 17 వేలు పైగా ఉపాధి కూలీలు ఇకెవైసి చేయాల్సి ఉండగా అందులో 2వేలు మాత్రమే ఇకెవైసి చేశారని అన్నారు. ఫీల్డ్ సిబ్బంది గ్రామాలకు వెళ్లి కూలీలచే ఇకెవైసి చేయించి త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు కావలసిన కూలీలు తమ జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జాబ్ కార్డులో ఉన్న వ్యక్తులు మరణించిన ఇతర పట్టణాలకు వెళ్లిన వారికి జాబ్ కార్డు లో నుంచి పేర్లను తొలగించాలన్నారు. గ్రామాలలో ఉపాధి పనుల కోసం కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. నీటి నిల్వ కోసం ఉండే పనులు, ఫారంపాండ్ పనులు రైతులు భూమల్లోని చేయాలని ఆయన ఉపాధి సిబ్బందికి తెలిపారు. గ్రామాల్లో నీటి నిలువ డ్యాములు సంబంధించిన పనులు సంబంధించి మైనర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. అన్ని గ్రామాలలో కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ పెంచలయ్య. ఇసి ఓబులేసు. టిఎలు సురేంద్రనాయుడు, చంద్రశేఖర్, నాగభూషణం, శివానందరెడ్డి .కళావతి. ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌టి ధరలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన జిఎస్‌టి 2.0 ధరలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో విద్యార్థులతో జిఎస్‌టి సూపర్ సేవింగ్‌పై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టాలను భరిస్తూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం జిఎస్‌టి ధరలను తగ్గించి వారికి ఉపశమనాన్ని కలిగించిందన్నారు. దీనితో అనేక వస్తువులపై ధరలు గణనీయంగా తగ్గడంతో రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా జిఎస్‌టి 2.0 ఉందన్నారు. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, నగదు లావాదేవీలు జరుగుతాయని, తద్వారా ఉద్యోగ కల్పన ఏర్పడుతుందన్నారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని సమకూరు స్థాయిని అన్నారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రామాం జులు, కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.**బి.కొత్తకోట** : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ జీఎస్టీ 2.0లో ఎలాంటి వస్తువులు ధరలు తగ్గాయనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ జీవి పల్లవి, ఎంపిడిఒ అబ్దుల్‌షకూర్, ఎంఇఒ రాజశేఖర్, భీమేశ్వరాచారి, ప్రముఖులు పాల్గొన్నారు.

11న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మానవత రైల్వే కోడూరు శాఖ వారి సహకారంతో అమర ఆస్పత్రి తిరుపతి వారిచే ఈనెల 11న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవత అధ్యక్షులు ప్రసాద్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హెచ్ఎంఎం హై స్కూల్ లో 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. కోడూరు గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరు వారి పాత రికార్డులు తీసుకు రావాలని ఉచిత వైద్యంతోపాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తామని తెలిపారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే సహించం : పీడీ

ప్రజాశక్తి - నందలూరు

ఉపాధి పనులలో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని, వచ్చే ఏడాది సామాజిక తనిఖీకి ఇది పునరావృతం కాకూడదని పీడీ వెంకటరత్నం హెచ్చరించారు.మండలంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం 20వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఏడాది కాలంలో ఉపాధి, పంచాయతీరాజ్ ద్వారా 5 కోట్ల 55 లక్షల 24 వేల రూపాయల పనులు చేయడం జరిగిందన్నారు. అందులో రూ.76వేలు నిధులు దుర్వినియోగం అయ్యాయని తెలిపారు. ఇందుకు రూ.15,500 అపరాధ రుసుం కూడా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి, ఎస్‌టి ఎంసత్యనారాయణ, ఏపీ డి మృత్యుంజయ రావు ఎస్ఆర్పి వెంకయ్య, ఏపీవో మురళి, ఉపాధి, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకం ట్రస్ట్ సభ్యులుగా సంధ్యారాణి

ప్రజాశక్తి-రాజంపేట : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా రాజంపేట మండలం ఆకేపాడు గ్రామానికి చెందిన దేవరకొండ భానుమూర్తి శర్మ సతీమణి సంధ్యారాణిని నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకితభావంతో దేవస్థానం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమె సిఎం, డిప్యూటీ సిఎం, చమర్తి జగన్‌మోహన్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు.


సంధ్యారాణి దంపతులు

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

పజాశక్తి-వీరబల్లి :సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా పేర్కొన్నారు. బుధవారం ఎన్ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్‌లో మొదటి రోజు దత్తత తీసుకున్న పెద్దమాదిగపల్లి ఎలిమెంటరీ స్కూల్‌లో స్పెషల్ క్యాంప్ ప్రారంభ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల ఎంఇఒ కృష్ణయ్య, ఎంపిడిఒ జవహర్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు భాస్కర్, రఘురామయ్య ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సమాజ సేవ కోసమే ఈ కార్యక్రమం రూపొందించబడిందన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు శ్యాంసుందర్ రెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్యకా చెరువుకు జలకళ..పొలాలు వెలవెల

- వ్యవసాయ భూమిలో కంప చెట్లు
- నష్టాలు తప్పవని సాగుకు ఆసక్తి చూపని రైతులు
- ఉపాధి కోసం గల్ఫ్‌కు పయనం


నిండుకుండల జలకలతో కన్యకా చెరువు

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రంలోని రాజంపేట-కడప ప్రధాన రహదారి లోనున్న నందలూరు కన్యకా చెరువు జలకలను సంతరించుకున్నా పొలాలు మాత్రం వెలవెల బోతున్నాయి. చెరువు కింద పొలాలు భీళ్లు గా మారి ఏపుగా పెరిగిన కంప చెట్లతో అడవిని తలపిస్తున్నాయి . ఈ చెరువులోని నీటి ద్వారా నందలూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఈదరపల్లె, దుర్గాపురం ఎస్‌టికాలనీ, నందలూరు ప్రాంతాల్లోని పొలాల్లో వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంది. దుర్గాపురం ఎస్టీ కాలనీ, ఈదరపల్లి రైతులు వ్యవసాయ వైపు మక్కువ చూపిస్తున్నారు. కానీ కన్యకా చెరువు కింద భూములు గల రైతులు వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయని పలువురు రైతులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. పలు సంవత్సరాలుగా ఇక్కడ భూములు కల రైతులు వ్యవసాయం చేయడానికి ముందుకు రావడం లేదు. గత కొన్ని నెలల ముందు కురిసిన వర్షాల ద్వారా చెయ్యేరు నందు నీరు ప్రవహించడంతో ఆ నీటిని మళ్లించి


ముళ్ల పొదలతో నిండిన చెరుకు కింద భూములు

చెరువును నింపడం జరుగుతుంది. చెరువులోని నీటిని వ్యవసాయానికి వాడుకోకపోతే వేసవికాలంలో నీరు ఇంకిపోయి వృధాగా మారే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలోని రైతులు ఎక్కువ శాతం వరి ,రాగులు, సొద్దలు , నువ్వులు పండించేందుకు ఆసక్తి చూపుతారు. ఈ పంటలు కాకుండా మరెన్నో రకాల పంటలు పండించేందుకు ప్రయత్నించాలని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. ఇప్పటికైనా రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని పలువురు కోరుతున్నారు.

వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలి



కన్యకా చెరువు కింద భూములు ఉండే రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలి. చెరువులో నీళ్ల నింపేందుకు కాలువకు మరమ్మతులు చేసి నీటిని నింపుతున్నావం. ఆ నీటిని రైతులు సద్వినియోగం చేసుకొని పంటల సాగుకు మక్కువ చూపాలి.

- భూశెట్టి వెంకటసుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షులు, నందలూరు

రైతులకు సహకారం అందిస్తాం



కన్యకా చెరువు కింద రైతులతో మాట్లాడుతున్నాం. అందులో కొంతమంది రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తున్నా రు. ప్రభుత్వం అంద చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించాం. వారు వేసే పంటలకు మండల వ్యవసాయ శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్దంగా ఉన్నాం.

- -మల్లికార్జున, వ్యవసాయ అధికారి

విజయవంతంగా ఎస్‌జిఎఫ్‌ఐ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రమైన సుండుపల్లె జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులు నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. బాడ్మింటన్ అండర్-17,14 బాలురు, బాలికల విభాగాలలో సుండుపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్ కాగా, జి కె రాచపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17 బాలురు, బాలికల విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీ అండర్-17,14 బాలుర విభాగంలో సుండుపల్లె విన్నర్స్, జి కె రాచపల్లె విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో అండర్ -17లో జి కె రాచపల్లె విద్యార్థులు విన్నర్స్, సుండుపల్లె విద్యార్థులు రన్నర్స్‌గా ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-14 లో విన్నర్స్‌గా జికె రాచపల్లె, రన్నర్స్ గా తిమ్మసముద్రం విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ అండర్-17లో విన్నర్స్ మడితాడు ఉర్దూ విద్యార్థులు, రన్నర్స్ తిమ్మసముద్రం తెలుగు విద్యార్థులు, అండర్-14లో విన్నర్స్ సుండుపల్లె బాలురు,రన్నర్స్‌గా తిమ్మసముద్రం తెలుగు విద్యార్థులు నిలిచారు. యోగా, చెస్ తో పాటు అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. మండల స్థాయి ఎస్‌జిఎఫ్ఐ టోర్నమెంట్, సెలెక్షన్‌లలో సుండుపల్లె ఉన్నత పాఠశాల, జికె రాచపల్లె, మడితాడు ఉర్దూ, తిమ్మసముద్రం, గుంతరాచపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాజంపేట డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు సుండుపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాహీరా బేగం, ఎస్‌జిఎఫ్ఐ మండల కో-ఆర్డినేటర్, పీడీ రాధారాణి తెలిపారు. పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్ర నాయక్, ఆంజనేయులు, మడితాడు, జి కె రాచపల్లె, గుంతరాచపల్లె ఉపాధ్యాయులు ఆరిపుల్ల,వెంకటేశ్వర రెడ్డి విజయకుమార్ నాయక్, శ్రీరాములునాయక్‌పాల్గొన్నారు.

జిల్లా జట్లకు విద్యార్థులు ఎంపిక

సాఫ్ట్ బాల్, బేస్ బాల్ ఉమ్మడి కడప జిల్లా టీం లకు సుండుపల్లె జడ్‌పి హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంపికయినట్లు ఆపాఠశాల పీడీ రాధారాణి తెలిపారు. బుధవారం కడప జిల్లాలోని పోరుమామిళ్ల లో ఎస్‌జిఎఫ్ అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న క్రీడలు, రాష్ట్ర జట్టు ఎంపికల కోసం సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సాఫ్ట్ బాల్ అండర్-19 బాలికల విభాగంలో బేబి, బాలుర విభాగంలో ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తమ ప్రతిభను చాటి సెలక్టర్ల దృష్టి లో పడ్డారు. బేస్‌బాల్ బాలికల విభాగంలో శ్రీలత, బేబి, బాలుర విభాగంలో భరత్ సత్తా చాటారు. దీంతో వీరికి సెలెక్టర్లు జిల్లా జట్లలో స్థానం కల్పించారు. వెంకటేశ్వర్లును బేస్ బాల్ జట్టులో స్టాండ్ బైగా తీసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటి ఉమ్మడి కడప జిల్లా కు గుర్తింపు తీసుకు రావాలని సెలెక్టర్లు విద్యార్థులకు సూచించినట్లు పీడీ రాధా రాణి తెలిపారు.**బి.కొత్తకోట** : పట్టణంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కె.జ్యోత్స్న (జావలిన్ త్రోలో ప్రథమ స్థానం),వై.మధురిమ (400 మీటర్స్ పరుగు పందెం ద్వితీయస్థానం),బి.బాలు (హై జంప్ ప్రథమ స్థానం) సాధించి జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్ -19 పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ శ్రీనివా సులు నాయక్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు .రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

పుల్లంపేట :మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికవడం జరిగిందని పాఠశాల పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ జి ఎఫ్ అండర్-19 బాలికల, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల పోరుమామిళ్లలో సాఫ్ట్ బాల్ మరియు బేస్బాల్ విభాగంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించడం జరిగిందని ఈ ఎంపికల్లో తమ పాఠశాలకు చెందిన బాలికలు సాఫ్ట్ బాల్ విభాగంలో జాస్మిన్ పదవ తరగతి, హర్షిత ఇంటర్ రెండవ సంవత్సరం, సంధ్య ఇంటర్ రెండవ సంవత్సరం ఎంపికైనట్లు తెలిపారు. బాలుర విభాగంలో విభాగంలో రిషిత్ వర్మ 10వ తరగతి, హేమంత్ పదవ తరగతి, బాలికల బేస్ బాల్ విభాగంలో జాస్మిన్ పదవ తరగతి, హర్షిత ఇంటర్ రెండవ సంవత్సరం, బేస్ బాల్ బాలుర విభాగంలో రిషిత్ వర్మ పదవ తరగతి, మోహిత్ పదవ తరగతి, అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి ప్రత్యేకంగా అభినందించారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిట్వేలి

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపిపి టంగుటూరి చంద్ర అధ్యక్షతన జరిగిన సర్వసభ్యం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రైల్వే కోడూరుఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే ప్రజా ప్రతినిధులు కొందరు 15 ఫైనాన్స్‌లో అవకతవకలు జరిగాయని వాటికి సంబంధించి కథనాలు వచ్చాయని ,వాటికి సంబంధించిన పూర్తి వివరాలు సభ దృష్టికి తీసుకురావాలని ఎంపిడిఒ శ్రీనివాసులను నిలదీశారు. అనంతరం వైసిపీ సీనియర్ నాయకులు, సర్పంచ్, ఎల్వి మోహన్ రెడ్డి జోక్యం చేసుకుంటూ 2021 వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఎంపిపి ఆధ్వర్యంలో ఒక్క రూపాయి అవినీతి జరిగి ఉన్న దానిని రుజువు చేయగలిగితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. దీంతో సభ ముందుకు సాగక ఎంపిడిఒను పూర్తి నివేదిక ఇవ్వాలంటూ నిలదీ యడంతో కొంత సమయం కావాలని ఇటీవల బదిలీపై రావడం జరిగిందని పూర్తి వివరాలు అందరికీ సమర్పిస్తానని ఆయన కోరారు. వారం రోజుల లోపు ఎంపిటిసిలతో సమావేశపరిచి తెలియజేస్తానన్నారు.అనంతరం ప్రారంభమైన సమావేశం శాఖల వారీగా వివరిస్తూ రావడం జరిగింది. గతంలోనూ ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులు ఈ సమావేశాలకు హాజరు కాకపోవడం ఆశ్చర్యకరం. రెవెన్యూ శాఖలో చిన్నచిన్న సర్టిఫికెట్లకు సైతం అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రజా ప్రతినిధులు తహశీల్దార్ స్పందన దృష్టికి తీసుకురావడం జరిగింది. విద్యుత్ శాఖలో మాటల తప్ప చేతలు పూర్తిగా లేవని గిరిజన కాలనీకు విద్యుత్ సరఫరా లో గత సమావేశంలో తెలియజేసిన ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఇటీవల మామిడి పంటలో దిగుబడి తగ్గుతూ వస్తుంది అని, ప్రకృతి వైపరీత్యాల వల్ల మామిడి దిగుబడి చాలా తగ్గిపోవడం దానికి సరిపడా మద్దతు ధర లేకపోవడం రైతులకు చాలా ఇబ్బంది కరంగా మారిందన్నారు. మార్కెట్ యార్డులో పక్క జిల్లా ల్లో ఉన్న విధంగా ఆర్థిక వనరులు తక్కువగా ఉన్నాయని అయినా రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ కోసం ప్రతిపాదనలు సేకరిస్తున్నామని అయితే వాటికి సంబం ధించిన పంటలు మన వైపు లేనందున ప్రభుత్వం చే వచ్చిన ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నారన్నారు. పశుసంవర్ధక శాఖలో మేకలు, గొర్రెలకు సీజన్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో లేవని, అతి పురాతనమైన ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు లేక మూతపడిందని, ఎప్పటినుండో ముస్లింలకు సంబం ధించిన షాదీ ఖానా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల వారు, ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకురావడం జరిగింది. అనం తరం ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి శాఖ వారు వచ్చే సమా వేశానికి సమావేశం దృష్టికి వచ్చిన పలు సమస్యల పైన ఈ మూడు నెలలలో జరిగిన అభి వృద్ధిపైసమస్యలను సభ దృష్టికి తీసుకురావాలి తప్ప అధికారులు కాలయాపన చేసే మాటలు మాట్లాడితే ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు మాత్రమే రావాల్సి ఉండగా ప్రజలు మమేకమై కూర్చో వడంతో ప్రాంగణం నిండిపోయింది. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుబ్ర హ్మణ్యంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు అన్సర్‌బాషా, ఎంపిటిసిలు నాగార్జున, సర్పం చులు గుత్తి నరసింహ, బాలురామాంజులనాయుడు, చంద్రమోహన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

'మిట్స్'లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-మదనపల్లె :మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ లోని ఎన్ఎస్ఎస్ విభా గం ఆధ్వర్యంలో మదనపల్లె లయన్స్ క్లబ్, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి, స్కంద సూపర్ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి సంయుక్తంగా రక్తదాన, నేత్ర వైద్య మరియు దంత వైద్య శిబిరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ విసి డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రధాన అతిథిగా పాల్గొన్న ప్రో-చాన్సలర్ నాదెళ్ల ద్వారకనాథ్ నాయుడు మాట్లాడుతూ రక్తదానం అత్యున్నత సేవగా, సమాజానికి ఉపకార మయ్యే విలువైన కర్తవ్య మన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.కమల బాషా, డాక్టర్ చెన్నయ్య, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నవీన్, నేత్ర నిపుణు రాలు డాక్టర్ నివేదిత, దంత నిపుణులు డాక్టర్‌రెడ్డి అఖిల్, డాక్టర్ మేఘన, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి : గ్రామాలలో చెత్త సేకరణకు ట్రై సైకిలను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ భానుమూర్తిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు మండలంలో 11 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా ఒక్కొక్క గ్రామానికి రూ.30 వేలు విలువ చేసే ట్రై సైకిళ్లను 11 ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రియాజ్‌అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

తల్లిపాలే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి తంబళ్లపల్లి :మండలంలో సూపర్వైజర్ రవణమ్మ అంగన్వాడీ వర్కర్లు చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత పైన తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాలు పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి అధికంగా పెంచుతుందనిన్నారు. కార్యక్రమంలో కోటకొండ శోభా, మండివారిపల్లి సునీత, కె.కురవపల్లి పద్మ, కుక్కరాజుపల్లి సుకన్య, మాదిగపల్లి గిరిజ, ఆయాలు పాల్గొన్నారు.

విద్యతో పాటు విభిన్న ప్రతిభ అవసరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యార్థులకు విద్యతో పాటు ఇతర అంశాలలోనూ విభిన్న ప్రతిభను కలిగి ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల(తెలుగు)లో 9వ తరగతి చదువుతున్న కె.నిఖిల్, ఎ.చైతన్య విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ నిర్వహించిన క్విజ్‌లో కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. వీరికి బహుమతితో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు నగదు బహుమతి లభించిందన్నారు. చదరంగం క్రీడా పోటీలలోను అండర్.17 విభాగంలో కె.నిఖిల్, అండర్ 14 విభాగంలో ఉదయ్‌చరణ్ పాఠశాలల చదరంగం క్రీడల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను క్రీడల్లోనూ తీర్చిదిద్దుతున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శారదన ఉపాధ్యాయులు అభినందించారు. చదువుతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

సిఎం సహాయ నిధి పేద లకు వరమని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో భువనగిరి పల్లెకు చెందిన చంగలరాయుడుకు రూ.5 లక్షల సిఎం సహాయనిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఆపత్కాలంలో పేదలకు సిఎం సహాయననిధి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, తేజాల ఆనంద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కు అందిస్తున్న చమర్తి

క్రైం కార్నర్

అతుకులు రోడ్డు తెచ్చిన ప్రమాదం

- బస్సు కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అతుకుల, గతుకుల రోడ్డు లో ద్విచక్ర వాహనంలో పయనించిన ఓ యువకుడు ప్రమాదం బారిన పడి బస్సు కిందపడి మృతి చెందాడు. ఈ దుర్ఘటన బుధవారం మదనపల్లి మండల పరిధిలో జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మలపల్లి మండలం, తవళం పంచాయతీ, కుమ్మర పల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డిరాణి దంపతుల కుమారుడు రంజిత్ కుమార్ (19) ఇంటర్ వరకు చదువి, ప్రస్తుతం మదనపల్లి లో ఫోటో స్టూడియోలో పనులు నేర్చుకుంటున్నాడు. బుధవారం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో మదన పల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని వశిష్ట స్కూల్ వద్ద ముందు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును అధికమించే క్రమంలో రోడ్డు పై రోడ్డుపై పడిన గుంతలు, రోడ్డు కోసుకుపోవడం కారణంగా అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో వెనకే వస్తున్న బస్సు రంజిత్ కుమార్ పై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించి కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న యువకుడు తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి వెళ్ళి కుమారుడు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. పని వెళ్తున్నానని ఇప్పుడే కదరా ఇంటి నుంచి వచ్చావు ఇంతలో ఇంత ఘోరం జరిగిందా.. ఓరి దేవుడా ఎందుకు మాకు ఇంత కడుపుకోత మిగిల్చావంటూ తల్లిదండ్రులు గుండెవిసేలా రోదించారు. రోడ్లు సక్రమంగా లేనందునే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా గ్రామీణ రోడ్లు మాత్రం బాగుపడడంచలేదని, ఎంతోమంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, పాలకులపై, అధికారులపై గ్రామస్తులు మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు మరమ్మత్తు చేయాలని పలువురు కోరుతున్నారు.

కుళ్లిన స్థితిలో చేనేత కార్మికుడి మృతదేహం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో చేనేత కార్మికుడు చనిపోయి ఇంట్లో కుళ్ళిన స్థితిలో ఉండటాన్ని పోలీసులు బుధవారం కనుగొన్నారు. మదనపల్లె వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. కలకడ మండలం, నడిమిచర్లకు చెందిన సుంకారపు నడిపి రెడ్డప్ప కుమారుడు సుంకారపు రెడ్డి(45) గత కొన్నేళ్ళుగా మదనపల్లెకు వలస వచ్చాడు. నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేఅవుట్‌లో కూలి మగ్గాలు నేసుకుంటూ భార్య జయమ్మ, పిల్లల్ని పోషించు కునేవాడు. భార్య జయమ్మ, పిల్లలు దైవదర్శనార్థం తిరుమలకు వెళ్లారు. మృతుడు సుంకారపు రెడ్డికి మొలల వ్యాధి ఉండడంతో మనస్తాపానికి గురై పూటుగా మద్యం తాగి ఆ మత్తులోనే ఇంట్లో ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. భార్య తిరుమల ఇంటికి రాగానే కుళ్లిన, దుర్వాసన వస్తుండడాన్ని చూసి, పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు వచ్చి తలుపులు తెరచి చూడగా సుంకారపు రెడ్డి మృతి చెంది, కుళ్లిన స్థితిలో మృతదేహం ఉండడాన్ని గుర్తించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం స్థానిక జిల్లా ఆసుపత్రి మార్చరీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : తంబళ్లపల్లెకి సమీపంలోని మల్లయ్య కొండకు వెళ్లే రోడ్డులో దర్గా వద్ద ఓ వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. బుధవారం ఉదయం రోడ్డుపై వెళ్తున్న వారు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఉమ మహేశ్వరెడ్డి సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సిబ్బందితో మృతదేహాన్ని బయటకు తీసి రెవెన్యూ అధికారులు, స్థానికుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. మృతుడు తంబళ్లపల్లె పట్టణంలోని మసీదువీధికి చెందిన మన్సూర్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ సమస్యలతో రాజస్థాన్ వాసి ఆత్మహత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని పోకనాటివీధిలో నివాసముండే రాజస్థాన్‌కు చెందిన ఉత్తం సింగ్ కుమారుడు విక్రమ్‌సింగ్(26) అనారోగ్యం, కుటుంబ సభ్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు..మృతుడి స్వగ్రామం రాజస్థాన్ రాష్ట్రంలోని బాలహోత్ర జిల్లా శివన గ్రామమని తెలిపారు. బతుకుదెరువు మొత్తం సుమారు ఆరు నెలల కిందట కొత్తకోటకి వచ్చారని తెలిపారు. వారి దూరపు బంధువైన గోపాల్ సింగ్ అరుబుద ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడని తెలిపారు. ఇతనికి ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు ఉండేవన్నారు. మంగళవారం ఫ్యాన్సీ స్టోరుకి సెలవు కారణంగా పోకనాటి వీధిలోని తన రూంలోనే ఉన్నాడని తెలిపారు. సుమారు 6.30 గంటలకు మృతుడి చెల్లెలు నిర్మా కన్వర్ ఫోన్ చేయగా ఎవరు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. తరువాత ఆమె ఇంటి యజమానికి ఫోన్ చేసి తన అన్న ఫోన్ తీయడం లేదు వెళ్లి చూడమని చెప్పగా,సదరు యజమాని గోపాల్ సింగ్ 8.30 గంటలకి రూము వద్దకు వెళ్లి చూడగా రూము తలుపులు మూసి ఉండి లోపల గడియ పెట్టబడి ఉందన్నారు. కిటికీలోనుంచి చూడగా అప్పటికే విక్రమ్ సింగ్ నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడని తెలిపారు.మృతుడి చెల్లెలు నిర్మల కన్వర్ ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరి వేసుకుని యువకుడి..

ప్రజాశక్తి-పీలేరు

కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇందిరమ్మ కాలనీలో చోటుచేసుకుంది. బుధవారం వెలుగు చూసిన సంఘటన వివరాలు పోలీసుల కథనం మేరకు.. పీలేరు మండలం, కాకులారంపల్లె పంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో పి. ధనుంజయ (29) అతని భార్య పావని నివాసం ఉంటున్నారు. జేసీబీ ఆపరేటర్ గా పని చేస్తూ జీవనం సాగించే ఇతనికి ఏడేళ్ల క్రితం పావనితో వివాహమైంది. పిల్లలు లేని వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలిసింది. వారం రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి లోనైన ఆ యువకుడు తానున్న ఇంట్లోనే ఆదివారం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటిలోపలి నుంచి దుర్వాసన వస్తుండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎస్. రహీం తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA

M.V.O.P. No : 555/2024

Thammisetty swathi and others ...Petitioners

Vs

Uppala Mallikharjuna, S/o. Setha nanda, R/O. mangampeta (V), Obulavaripalli (M), annamaiah (D.T.). ...Respondent

SUMMONS TO R1 U/O 5 R1 OF CPC

పై తెలిపిన పిటిషనర్లు రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలినందుకుగాను 1వ ప్రతివాది అయిన మీ మీద మరియు 2వ ప్రతివాది మీద నష్టపరిహారము కోరి మీపైన కేసు దాఖలు చేసియున్నారు. కనుక 1వ ప్రతివాది ఐన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టులో మీరు స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గానీ 22.10.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనంతట ఈ కేసును మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//

K. KRISHNAIAH,
Advocate,
Cell: 80746 52239

మహారాజశ్రీ పీలేరు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No. 15of 2024

శ్రీ సంగటాని సుబ్రమణ్యం @ ఎస్.సుబ్రమణి. ...పిటిషనర్

Vs

శ్రీ ఎర్రదొడ్డి భారతి మరియు వగైరాలు ...రెస్పాండెంట్

7వ రెస్పాండెంట్‌నకు నోటీసు

7వ రెస్పాండెంట్:
Sri Sanjeeva, S/o Peddanna, Lab Assistant in Heritage dairy, Tirupati Road, Piler Village, Post & Mandal, Annamaiah District, Cell No: 9000887751.

పై పిటిషనర్ దాఖలు చేసిన పై పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కేసును 31.10.2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు, కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 31.10.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియచేయడమైనది.

//By Order of Court//

ఎస్.నిరంజన్ కుమార్,
న్యాయవాది, పీలేరు.